

శ్రీవారి హుండీల ఆదాయం రూ.1.85 కోట్లు

హుండీలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి యాత్రికుల విరాళాల ద్వారా రూ.1,85,91,793 ఆదాయం లభించిందని ఆలయ ఇఒ వేండ్ర త్రినాధరావు తెలిపారు. దేవస్థానం హుండీలను బుధవారం ఉదయం అత్యంత భద్రత ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూపేణా పై పేర్కొన్న మొత్తం, బంగారం 155 గ్రాములు, వెండి ఐదు కేజీల 25 గ్రాములు, పాత రూ.500 నోట్లు 30, రూ.వెయ్యి నోటు ఒకటి, విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఇఒ తెలిపారు. 20 రోజులకు గాను ఈ ఆదాయం లభించిందన్నారు.

గాడి తప్పిన వైద్యం..!

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిస్థితి ఘోరం

చిన్నపాటి కేసులు సైతం విజయవాడ, గుంటూరుకు రిఫర్

గత్యంతరం లేక ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు

సీనియర్ వైద్యుల బదిలీతో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం

ఆసుపత్రి పర్యవేక్షణను పూర్తిగా గాలికొదిలేసిన బాధ్యులు

తాజా ఘటనతో మరోసారి సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలపై చర్చ

జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అనే చందంగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యసేవలు తయారయ్యాయి. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఎంతోమంది రోగులకు రక్షణగా నిలిచిన ఆసుపత్రిలో నేడు వైద్యసేవలు పూర్తిగా గాడి తప్పిన పరిస్థితి నెలకొంది. ఏలూరులోని జిల్లా ఆసుపత్రిని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మార్పు చేశారు. ఈ ఏడాది 150 మంది వైద్య విద్యార్థులు సైతం ఇక్కడ బోధనా ఆసుపత్రిలో వైద్య విద్య అభ్యసించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బోధనా ఆసుపత్రిగా మారితే మరిన్ని వైద్య సదుపాయాలు, స్పెషలిస్ట్ వైద్యులు, సాంకేతికత అందుబాటులోకి వస్తాయని అంతా ఆశించారు. అయితే పరిస్థితి అందుకు విరుద్ధంగా తయారైంది. బోధనా ఆసుపత్రిగా మారడంతో సీనియర్ వైద్యులను వేరే ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో వైద్య సేవలు పూర్తిగా పడకేశాయి. జిల్లా ఆసుపత్రిగా ఉండగా రోజుకు 1200 నుంచి 1500 మంది అవుట్ పేషెంట్లు ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందేవారు. సరైన వైద్యులు లేకపోవడంతో ప్రస్తుతం 600 నుంచి 800 మంది రోగులు మాత్రమే ఒపి సేవలు పొందుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అధికారుల పర్యవేక్షణ కొరవడటమేనని చెప్పొచ్చు. గతంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన అధికారులు ఆసుపత్రిలో చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే స్పందించడం, తగు చర్యలు తీసుకోవడం వంటివి చేసేవారు. సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత బాధ్యతలు స్వీకరించిన పర్యవేక్షణాధికారులు జనాలకు దూరంగా ఉంటున్న పరిస్థితి ఉంది. ఎవరితోనూ మాట్లాడే పరిస్థితి లేదనే చర్చ నడుస్తోంది. ఇష్టం లేకుండా ఇక్కడకు వచ్చినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. రోగుల గురించి పెద్దగా పట్టించుకోని పరిస్థితి ఉంది. గతంలో ఏలూరుతోపాటు పరిసర ప్రాంతాల్లో తలతిరిగి పడిపోయిన వ్యాధితో దాదాపు 600 మందికిపైగా ఆసుపత్రిలో చేరారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి అందరినీ కోలుకునే విధంగా చేసి రాష్ట్రస్థాయిలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక ఖ్యాతి గడించింది. పురుగుల మందు తాగిన రోగులను ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికే తరలించేవారు. మెరుగైన వైద్యం అందించి పంపించేవారు. అలాంటి పరిస్థితి ఇప్పుడు మచ్చుకైనా కానరావడం లేదు. చిన్నపాటి కేసులను కూడా విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తున్నారు. తమకు ఏమీ సంబంధం లేదన్నట్లు వదిలించుకుంటున్నారు. అటువంటప్పుడు బోధనా ఆసుపత్రిగా మార్పు చేసి ప్రయోజనం ఏమిటని జనం ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పే నాథుడే లేకుండాపోయాడు. సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలపై జనం నుంచి తీవ్ర విమర్శలు వస్తూనే ఉన్నాయి.

తాజా ఘటనతో వైఫల్యాలు బట్టబయలు

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేరిన గర్భిణికి ఆపరేషన్ చేసిన వైద్యులు కడుపులో ఫోర్‌సెప్స్ వదిలేసిన తాజా ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనను బయటకు రాకుండా చేయాలని ఆసుపత్రి అధికారులు తీవ్ర ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల ఎనిమిదో తేదీన కడుపునొప్పితో బాధిత మహిళ ఆసుపత్రిలో చేరినప్పటికీ 16వ తేదీ వరకూ బయటి ప్రపంచానికి తెలియకుండా చేశారు. విజయవాడ ఆసుపత్రికి రిఫర్ చేసి చేతులు దులుపుకున్నారు. ఇదేవిధంగా సరైన వైద్యసేవలు అందక రోగులు పడుతున్న ఇబ్బందులు బయటికిరాని పరిస్థితి నెలకొంది. వైద్యసేవలపై అధికారులు దృష్టి సారించకపోవడమే దీనికి ప్రధాన కారణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రిఫరల్ కేసులపైన, సర్వజన ఆసుపత్రిలో వైద్యసేవలపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఎక్స్‌రే, స్కానింగ్ వంటి రిపోర్టులు ఒకరోజు తర్వాత ఇస్తున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు రెండు, మూడు రోజులు ఆసుపత్రి చుట్టూ తిరగాల్సి వస్తోంది. పరీక్షలు చేసిన తర్వాత రిపోర్టులు త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం నిర్వహిస్తామని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ జిల్లా ఛైర్మన్ జె.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పవర్ జెఎసి ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 17వ తేదీన కార్మిక శాఖ అధికారులకు లేఖలు ఇవ్వనున్నట్లు తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ ప్రభుత్వం ఈనెల తొమ్మిదో తేదీన పవర్ జెఎసితో చేసిన ఒప్పందం విద్యుత్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరితే ఎనిమిది శాతం ఇవ్వడం దుర్మార్గమన్నారు. తెలంగాణాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్ట్ పేమెంట్ అమలు చేయడం వల్ల కార్మికులు లబ్ధి పొందారన్నారు. కానీ మనరాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ద్రోహం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనంతో కాంట్రాక్ట్ కార్మికులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 17న చేపడుతున్న విద్యుత్ సౌధా వద్ద ధర్నాను వాయిదా వేసినా జిల్లాలో పోలీసులు ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగుల ఇళ్లకు అర్ధరాత్రి వెళ్లి నోటీసులు ఇవ్వడం, బెదిరించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ పోలీసులు ఇలా వ్యవహరించడం తగదన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉండగా సంవత్సరంపైగా పాదయాత్ర చేసి ప్రజాస్వామ్య హక్కుల గురించి గొంతెత్తి మాట్లాడి అధికారంలోకి వచ్చిన తర్వాత నియంతృత్వ చర్యలకు పాల్పడటం హేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన సమస్యలపై స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమిత 'అసైన్డ్'ను స్వాధీనం చేసుకోవాలి

డిఆర్‌ఒకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి


వినతిని అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

30 ఏళ్లుగా పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం హక్కు పత్రాలు ఇవ్వాలని, యాజమాన్య హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ మూర్తికి సంఘం జిల్లా కమిటీ బృందం పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, ఎ.రవి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా పేదలు, దళితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అసైన్మెంట్ భూముల ఆర్డినెన్స్ వల్ల పేదలకు ఒరిగేదేమీ లేదని ప్రశ్నించారు. పేదల చేతుల్లో ఉన్న భూములు భూస్వాములకు, అధికార ప్రతిపక్ష రాజకీయ పార్టీ నేతలకు కట్టబెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. జిల్లాలోని దోసపాడు, పోతునూరు, కొవ్వలి, దెందులూరు గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్, సీలింగు, గయాళ భూములు స్థానిక, స్థానికేతర భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం, కేతవరం, గురవాయిగూడెంలో సుమారు రెండు వేల ఎకరాలకు పైగా సీలింగ్ భూములు భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఆరేళ్లుగా పంగిడిగూడెం సీలింగ్ భూముల కోసం దళితులు నిరంతర పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం మండలాల మధ్యలో ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములు పేదలకు పంచాలని ఆరున్నరేళ్ల నుండి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. చట్ట వ్యతిరేకంగా ఇరిగేషన్ భూముల్లో విద్యుత్, ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై భూస్వాముల బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి దళిత, గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామమ్మగూడెంలో 45 ఏళ్ల నుండి వారసత్వంగా వస్తున్న భూమిని అమరావతి భూస్వాములకు కట్టబెట్టేలా రెవెన్యూ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. కృష్ణాపురం మెట్టలో ఇళ్లు నిర్మించుకుని 15 ఏళ్ల నుండి పేదలు, దళితులు, గిరిజనులు నివాసముంటున్నారని, వారికి విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. పట్టెన్నపాలెం, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల ఎల్‌టిఆర్ భూములకు సాగు పత్రాలివ్వాలని, వారికి సర్వ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ముసునూరు, చాట్రాయి, లింగపాలెం మండలాల్లో ఉన్న వందలాది ఎకరాల అసైన్డ్, అటవీ భూములను పేదలకు పంచాలని కోరారు. ద్వారకాతిరుమల మండలంలో ఉన్న సుమారు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములు అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న భూములను ఆక్రమించుకుని చట్ట వ్యతిరేకంగా సాగుచేస్తున్న మండలస్థాయి రెవెన్యూ శాఖ అధికారులు భూస్వాములిచ్చే లంచాలుమింగి దళిత, గిరిజన పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.

దీనిపై డిఆర్‌ఒ మూర్తి స్పందిస్తూ జిల్లాస్థాయిలో పేదలకు న్యాయం చేసే విధంగా చట్టపరమైన విషయాలను అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.సత్యనారాయణ, మడకం సుధారాణి, జిల్లా కమిటీ సభ్యులు నక్క సుబ్బారావు మురళీ, కుమారి, సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను మోసగించిన జగన్

ఏలూరు టౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు పాలకులు ఇచ్చిన హామీ మేరకు డిపాజిట్లు చెల్లించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యర్రా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యర్రా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు సిఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. బాధితుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర అసోసియేషన్ తీసుకునే కార్యక్రమాలను జిల్లాలో జయప్రదానికి ఈనెల 27న రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు హాజరవుతున్నారని, జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల వారిని ఆహ్వానిస్తున్నట్లు అసోసియేషన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు చెక్క జగన్, ఎవి.రాంబాబు, బి.రామకృష్ణ, ఎస్.సూర్యనారాయణ, ఎం.నారాయణరావు. జి.వెంకటేశ్వరరావు, బి.మంగరాజు, వివి.సూర్యనారాయణ, శేషు, ఎం.రామసుబ్బారావు, బిఎన్.సాగర్ పాల్గొన్నారు.

13 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్: జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో 13 మంది తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు తలసేమియా చిన్నారులను పరీక్షించి, రక్తమార్పిడి చేశారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత పి.కృష్ణకుమారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, మానవత సభ్యులు పి.పండరినాథ్, కోనేరు రవి, కెవి.రమణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - పోలవరం

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, 2015లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కార్మికులను క్రమబద్ధీకరించాలని జిల్లా పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షులు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి బుధవారం ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో హైకోర్టు టెండర్ విధానం రద్దు చేసి పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరారు. ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల జీతాలు చెల్లించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ధనాల ఫణీంద్ర, వారా నాని, ఉసురుమ్మతి భీమరాజు, మాడుగుల సాయి పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వచ్చేనెల తొమ్మిదో తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ యోగ్యమైన క్రిమినల్ కేసులను గుర్తించి పరిష్కారం నిమిత్తం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏలూరు డివిజన్ పోలీసు అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసుల్లో కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని, దీనికోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. డిఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులను ఎక్కువగా పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేయాలని పోలీసులకు సూచించారు.

ఏజెన్సీలో 5 ఆధార్ కేంద్రాలు

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో ప్రజలకు ఆధార్ సేవలకు ఇబ్బందుల్లేకుండా ప్రతీ మండలంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని కెఆర్‌పురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూర్యతేజ తెలిపారు. బుధవారం కెఆర్‌పురం ఐటిడిఎ సమావేశ హాలులో ఐదు ఆధార్ సెంటర్లకు సంబంధించిన ఆధార్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ 10 ఆధార్ కిట్లు బ్లూ త్రి ఐటి సొల్యూషన్స్ ప్రయివేటు లిమిటెడ్ ద్వారా పనిచేస్తున్నాయని, ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలందరూ ఈ ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని పిఒ కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ నాయుడు, మేనేజర్ ప్రకాష్, ఆధార్ రీజనల్ మేనేజర్ వి.డేవిడ్ కమలాకర్, డివిజనల్ కో ఆర్డినేటర్ బి.డేవిడ్, పోలోజు, రాజశేఖర్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో చేపట్టిన ఇంటింటికీ ఓటర్ల జాబితా పరిశీలన పారదర్శకంగా జరుగుతుందని ఇప్పటి వరకూ 77 శాతం సర్వే పూర్తయినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరు లక్షల 37,466 ఇళ్లకుగాను ఇంతవరకూ నాలుగు లక్షల 90 వేల 298 ఇళ్లకు సంబంధించి ఓటర్ల జాబితా సర్వే పూర్తయిందన్నారు. ఓటర్ల జాబితా సర్వేకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తమకు స్వయంగా తెలియజేస్తే అలాంటి వాటిని విచారించి తగు చర్యలు తీసుకుంటామని రాజకీయ పక్షాల ప్రతినిధులకు ఆయన స్పష్టంచేశారు. ఏలూరు జిల్లాలో జనన, మరణాల రిజిస్టరు అనుసరించి 2019 నుండి 2022 వరకూ సుమారు 56 వేల మంది ఓటర్లు మరణించినట్లు తెలుస్తుందని ఆ మేరకు అలాంటివి గుర్తించి ఇప్పటి వరకూ సుమారు 45 వేల మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించామన్నారు. గడిచిన వారంరోజుల్లో 6277 మరణించిన వారి పేర్లను తొలగించామని తెలిపారు. వారం రోజుల్లో కొత్తగా 9207 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఓటర్ల జాబితా హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ ప్రక్రియ ఈ నెల 21వ తేదీలోగా పూర్తవుతుందన్నారు. జిల్లాలో ఇంకా ఓటరుగా నమోదు కానీ 18 సంవత్సరాల దాటిన యువతను, వికలాంగులను గుర్తించి వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, నెరుసు నెలరాజు(బిజెపి), పి.కిషోర్(సిపిఎం), రాజనాల రామ్మోహన్‌రావు (ఐఎన్‌సి), కలవకొల్లు సాంబ(వైసిపి), ఎస్.అచ్యుతబాబు(టిడిపి), ఎం.ధశరధ కుమార్ (ఆమ్ ఆద్మీ పార్టీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు.. స్వాతంత్ర సమరయోధులు

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

దేశాన్ని, సమాజాన్ని రక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ సమరయోధుల నుండి ప్రేరణ పొంది ముందుకు సాగాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. మంగళవారం రాత్రి కోటదిబ్బలో ఉన్న సీతారామ భర్తియా కళ్యాణ మండపంలో ఎవిఆర్ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కళానీరాజనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సాబ్జీ మాట్లాడారు. దేశంలో ఇప్పటికీ పేదరికం, నిరుద్యోగం తీవ్రస్థాయిలో ఉండటం బాధాకరమన్నారు. దేశ ప్రజల సంపదను దోపిడీ నుండి కాపాడుకోవడానికి అల్లూరి సీతారామరాజు జీవితం నుండి ప్రేరణ పొందాలన్నారు. అనంతరం విజ్ఞానకేంద్రం సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, సభ అధ్యక్షులు వై.ఆనందనాయుడు, విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ తరపున విజిఎంవిఆర్.కృష్ణారావు, ఎస్‌వి.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు బహుమతులు, పుస్తకాలు అందజేశారు. సభలో అతిథిగా సెట్ వెల్ సిఇఒ ఎండి మెహర్ రాజా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కెఎస్‌కె సత్యనారాయణ, పీడీ.రత్నాకర్ రావు, ఎస్.కస్తూరిరావు, పి.ఆంజనేయులు, మేతర అజయ్‌బాబు, ఎన్.గంగాభవాని, వై.అర్జునరావు, వి.సురేష్, పి.హైమావతి, కె.శ్రావణకుమారి, డి.గణేష్, ఎస్.రవి, పి.ప్రసాద్ వేదికను అలంకరించారు. కళా ప్రదర్శనలిచ్చిన 40 మంది కళాకారులకు, వివిధ విద్యాలయాల్లో నిర్వహించిన అకాడమిక్ పోటీల విజేతలు 120 మందికి ప్రశంసాపత్రాలు, అల్లూరి జీవిత చరిత్ర పుస్తకాలు, జ్ఞాపికలు సాబ్జీ, ఇతర అతిథుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.లింగరాజు, వి.సాయిబాబు, జాన్‌బాబు, జింగిల్ బెల్స్ స్కూల్ డైరెక్టర్ కడియాల విజయలక్ష్మి, కోలాట బృంద సమన్వయకర్త వై.విష్ణుమహేశ్వరి, నృత్యాంజలి నృత్య నికేతన్ నాట్యాచార్యుడు గండికోట రాజేష్, స్వర్ణాలయం నృత్యాలయం నాట్యాచారిణి స్వర్ణలత, కె.శ్రీనివాసరావు, గాయకులు పి.సూర్యప్రకాశరావు, రంగవరప్రసాద్, ఎం.వెంకట్రావు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

భీమడోలు: స్వాతంత్ర ఉద్యమ లక్ష్యాల సాధనకు యువత నడుం బిగించాలని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పది విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు సిఐటియు, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. విజేతలకు భీమడోలులోని డిపాల్ హైస్కూలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా గుడిపాటి నరసింహారావు తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనం తరం డిపాల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర్‌రావు, కెవిపిఎస్ మండల కన్వీనర్ సుమన్‌బాబు ప్రసంగించారు .

ల్యాండ్ మాఫియాను అడ్డుకుంటాం : ఎస్‌పి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పరిసరాల్లో జరుగుతున్న ల్యాండ్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. బుధవారం ఆమె ముందుగా లక్కవరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. నేరాల అదుపు చేయడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం జంగారెడ్డిగూడెం స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎం.ధనుంజయుడు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది గౌరవవందనం తెలిపారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లో పలుదస్త్రాలు పరిశీలించినట్లు చెప్పారు. పట్టణంలో జరుగుతున్న ల్యాండ్ మాఫియాపై ఇప్పటికే పలు ఫిర్యాదులు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ల్యాండ్ మాఫియాపైగట్టి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్, స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. ఉద్యోగాలిప్పిస్తామని కొంతమంది నిరుద్యోగ యువత డబ్బు వసూలు చేస్తోందని, వారిపై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు బుట్టాయగూడెం మండలం దొరమామిడి పంచాయతీ కొత్త సరుగుడు కాలనీలో అదృశ్యమైన బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

11 మందికి సిఐలుగా ఉద్యోగోన్నతి

ఏలూరు స్పోర్ట్స్: ఏలూరు రేంజ్ పరిధిలో 11 మంది ఎస్ఐలకు సిఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 20 మంది ఎస్ఐలకు సిఐలుగా ప్రమోషన్లు కల్పిస్తూ రాష్ట్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఏలూరు రేంజ్ పరిధిలో వివరాలిలా ఉన్నాయి ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న టి.చంద్రశేఖర్, ఎం.ఆదాము, చింతపల్లి వెంకటేశ్వరరావు, మహ్మద్ హబీబ్ బాష, కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న ఎం.నాగరాజు, పీతల దొరబాబు, తాడంకి క్రాంతికుమార్, బొంగు తిరుపతిరావు, వాస వెంకటేశ్వరరావు, చల్లపల్లి విద్యాసాగర్, ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న ఉబ్బా శ్రీనివాసరావు సిఐగా ఉద్యోగోన్నతి పొందారు.

భూ ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - మండవల్లి

దళితుల భూమిని ఆక్రమించుకోవడమే కాక ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి పాల్పడటం సమంజసం కాదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు అన్నారు. 'మా భూములు మాకు అప్పగించాలి' అంటూ రెవెన్యూ కార్యాలయం వద్ద సింగనపూడి దళితులు బుధవారం నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగనపూడిలోని 20 దళిత కుటుంబాలకు ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో 15.59 ఎకరాల భూమిని 1925లో ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అప్పటి నుండి దళితులు ఆ భూమిని సాగుచేసుకుంటూ జీవించారని వివరించారు. 1992లో చేపల సాగుకు ప్రభుత్వం అనుమతివ్వడంతో పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టలేక కైకలూరుకు చెందిన పెత్తందారీ మాడపాటి కృష్ణప్రసాద్‌కు చెరువు తవ్వేలా దళితులు లీజుకు ఇచ్చారని, 2016 వరకూ లీజు చెల్లించి, ప్రస్తుతం చెరువు తనదేనంటూ దళితులపై దౌర్జన్యానికి దిగాడన్నారు. అప్పటి నుండి దళితులు తమ భూమి తమకు అప్పగించాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని తెలిపారు. ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తీర్పు వచ్చేవరకూ ఇరువురినీ ఆ భూమిలోకి వెళ్లకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో పాటు చెరువు వద్ద ఇది ప్రభుత్వ భూమి అని, ఎలాంటి కార్యకలాపాలు చేయొద్దంటూ హెచ్చరిక బోర్డను కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే కృష్ణప్రసాద్ జెసి ఆదేశాలను బేఖాతరు చేస్తూ చెరువులో చేపల సాగు చేస్తున్నాడని, ప్రశ్నించిన దళితులపై దౌర్జన్యానికి దిగి దుర్భాషలాడిప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిని అందించారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు కె.జగదీష్, పి.దావీదు, బి.చింతయ్య, పి.సుధీర్ కుమార్, ఎం.ఆదాము, పి.యెహోషువ, పి.ఇశ్రాయేలు, పి.శాంతాబాయి, కమలమ్మ, కరుణ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు

15వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఏలూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలుంటాయని, దీనిపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం జిల్లాలో బాల్య వివాహాలు నిర్మూలనపై మాసాంతర అవగాహన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి వాల్‌పోస్టర్లను జెసి బి.లావణ్యవేణితో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 16 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకూ బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేస్తే జరిగే అనర్థాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యవివాహాలు చేయకూడదని 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ అమ్మాయిలకు వివాహం చేయకూడదన్నారు. బాలికకు వివాహం చేస్తే వరుడితోపాటు వరుడి తల్లిదండ్రులకు, వధువు తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు పోక్సో చట్టప్రకారం విధించబడే శిక్ష 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వరకూ జైలు శిక్ష, జరిమానా లేదా జీవితఖైదు కూడా విధించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ ఆర్.కుముదినీసింగ్, మెప్మా పీడీ ఇమ్మానియేల్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిపిఆర్‌ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు, డిసిపిఒ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

అంతా చదువుకోవాలి : ఎంపిడిఒ

చింతలపూడి : 18 సంవత్సరాల లోపు విద్యార్థులందరూ చదువుకోవాలని ఎంపిడిఒ యం.మురళీకృష్ణ తెలిపారు. చింతలపూడి పట్టణంలో ఎంఆఇ కార్యాలయం వద్ద వెల్ఫేర్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు జిఆజర్ 100 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చింతలపూడి మండలంలో 1,685 మంది చదువుకోవటం లేదని, వీళ్ల చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కిరణ్ బాబు, ఎంఇఒ రామారావు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో శ్రీవిద్యాలయ విద్యార్థుల ప్రతిభ

భీమడోలు : ఏలూరుకు చెందిన వైఎంహెచ్ఎ, ఐవిఆర్ విజ్ఞాన వేదిక సంయుక్తంగా స్వతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గుండుగొలనుకు చెందిన శ్రీవిద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను, బహుమతులను సాధించిన విద్యార్థులు కంచర్ల రాజేష్, ఎస్.అక్షిత, వి.దుర్గాప్రసాద్, అర్.విస్ట్ ప్రక్రిక, ఎం.యశోద, ఎం.శరణ్య, బి.అక్షిత, బి.మౌనిక, జి.బృహారాని పాఠశాల యాజమాన్యం గుండుగొలనులో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు.

విద్యార్థిని వెంబడించి కరిచిన కుక్క

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సైకిల్‌పై వెళుతున్న విద్యార్థిని వెంబడించి కుక్కలు కరిచిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన విద్యార్థి వీరమాచినేని ద్వారక కృష్ణ(10) సైకిల్ తొక్కుతూ ఉండగా వెంబడించిన కుక్కలు కరిచాయి. దీంతో భయపడి విలపిస్తున్న కృష్ణను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వసతి గృహం నిర్మించాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని ఇప్పలపాడు గిరిజన ఆశ్రమ బాలిక కళాశాల హాస్టల్ భవనం నిర్మించాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కెఆర్‌పురం రోడ్డు సెంటర్‌లో ర్యాలీ, ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం గిరిజన దర్బార్‌లో ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.విరేష్ మాట్లాడుతూ ఇప్పలపాడులో నూతన తరగతుల భవనంలో 2018 నుంచి కళాశాల కొనసాగుతుందన్నారు. కాని నేటికీ గిరిజన ఆశ్రమ బాలిక కళాశాల హాస్టల్‌కు భవనాలు నిర్మించలేదన్నారు. హాస్టల్ భవనాలు నిర్మించేందుకు స్థలం ఉన్నప్పటికీ నిధులు కేటాయించి, నూతన భవనాలు నిర్మించకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. అంతేకాకుండా కళాశాల వెళ్లాలంటే బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంత కుకునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూ కళాశాలకు వెళ్తున్నారన్నారు. కావున విద్యార్థులకు శాశ్వత వసతి గృహ భవనాలు, బస్సు సౌకర్యం, మంచినీటి సదుపాయం కూడా తక్షణమే కల్పించాలని పిడిఎస్‌యు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్. దుర్గాప్రసాద్, ఎం.జానకిరామ్, టి.బాబురావు, బి. పవన్, జి.కిరణ్, కె.ప్రవీణ్, ఎస్.గణేష్, కే.నాగేంద్ర, ఎం.తేజ, జె.సాత్విక్, ఎం.ప్రసాద్, పి.సాంబ, వై. హర్ష కె.లికిత్, విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

టి.నరసాపురం: మనస్తాపంతో కలుపు మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎపిగుంటలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎపిగుంట గ్రామానికి చెందిన చాపలమడుగు సౌజన్య (22) ఈనెల 11న అత్తతో గొడవ పడి మనస్తాపంతో కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను వెంటనే చింతలపూడి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ 15వ తేదీ రాత్రి ఆమె మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో ఎస్ఐ కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

నూజివీడు రూరల్: మండలంలోని తుక్కులూరు గ్రామంలోని బైపాస్ రోడ్డు సమీపంలో బుధవారం బైకును వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన యువతి యాదవలత(27) తీవ్ర గాయాలు కావడంతో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ సంఘటన గ్రామంలో తీవ్రవిషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళకు అస్వస్థత

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఆర్ఆర్ పేటకు చెందిన మహిళ ఎండిఎస్ బేగం(34) కడుపునొప్పి మాత్రలుగా భావించి నిద్రమాత్రలు మింగటంతో బుధవారం అపస్మారక స్థితికి చేరుకుంది. భర్త ఖాన్ నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. భర్త ఖాన్ నిత్యం నిద్ర పట్టడానికి వైద్యుల పర్యవేక్షణలో మాత్రలు వేసుకుంటాడని, ఆ మాత్రలనే కడుపు నొప్పి టాబ్లెట్ అనుకుని బేగం వేసుకుందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నూజివీడు రూరల్: మండల పరిధిలోని సిద్ధార్థ నగర్ గ్రామంలోని మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకొని, 11 మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు.

బ్యాగ్‌లో తరలిస్తున్న మద్యం పట్టివేత

జీలుగుమిల్లి : జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ నుంచి జీలుగుమిల్లికి బ్యాగ్‌లో 13 మద్యం బాటిళ్లను పెట్టుకొని వస్తున్న వ్యక్తిను తనిఖీ చేయగా అందులో 13 మద్యం బాటిళ్లను గుర్తించామని పోలీసులు తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

ఏలూరు స్పోర్ట్స్ : నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురు వ్యక్తులకు న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వీరిని గురువారం ఒకటో పట్టణ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. వీటిని న్యాయస్థానానికి జమ చేశారు.

ఆటో బోల్తా డ్రైవర్‌కు గాయాలు

ఏలూరు స్పోర్ట్స్ : ఆటో అదుపు తప్పి తిరగబడి పలువురికి గాయాలైన ఘటన ఏలూరు నగర శివార్లో చోటుచేసుకుంది. ఏలూరు నగరం నుంచి చెక్కపల్లి ప్రాంతానికి ఆటోలో వెళుతున్నారు. ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తితో పాటు ఆటో డ్రైవర్ ఉన్నారు. ఆర్‌డిఒ కార్యాలయ సమీపానికి చేరుకునేసరికి ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో మహిళలందరికీ స్వల్ప గాయాలు కాగా వారు అక్కడి నుంచి వేరొక ఆటోలు వెళ్లిపోయారు. డ్రైవర్‌కు మాత్రం గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వే ఆసుపత్రికి తరలించారు.

వృద్ధురాలిపై దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

భీమడోలు : గుండుగొలనులో వృద్ధురాలిపై కర్రతో దాడి చేసి, గాయాల పాలు చేసిన ఒక వ్యక్తిని బుధవారం అదుపులోనికి తీసుకుని భీమడోలు కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నేమల మంగ అనే వృద్ధురాలికి అదే గ్రామానికి చెందిన మెండ్యాల శ్రీను అనే వ్యక్తి ఒక వజ్రాన్ని రూ.16 లక్షలకు ఇచ్చారు. ఆ తరువాత క్రమంలో వజ్రాన్ని కొనుగోలు చేసిన వృద్ధురాలు పరీక్ష చేయించగా నకిలీ వజ్రంగా తేలింది. ఈ విషయమై శ్రీనును నిలదీసినప్పటికీ ఫలితం లేకపోవడంతో భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేసారు. అప్పట్లోనే కేసు నమోదు చేసిన పోలీసులు చార్జిషీటు తయారు చేశారు. ఈ మధ్య కాలంలో శ్రీనును వృద్ధురాలి బాకీ చెల్లింపు కోసం నిలదీశారు. మెండ్యాల శ్రీను ఆమెపై కర్రతో దాడి చేశాడు. చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టుకు హాజరు పరచగా, కోర్టు వారు నిందితునికి రిమాండ్ విధించారు. నిందితున్ని జిల్లా జైలుకు తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థికి నగదు పురస్కారం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు..

ఉపాధ్యాయునిగా తాను విద్యాబోధన చేసిన సోషల్ సబ్జెక్ట్‌పై ఆసక్తితో, దాని ప్రచారానికి తన వంతు సహాయం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు సేవలు అభినందనీయమని భీమడోలు హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక హైస్కూల్లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గత విద్యా సంవత్సరం నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో సోషల్ సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు సాధించిన తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.2వేల నగదు ప్రోత్సాహకాలను తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు హెచ్ఎం చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2016-17 సంవత్సరంలో తాను ఉంగుటూరు మండలం గొల్లగూడెం హైస్కూల్‌కు బదిలీ అయ్యానన్నారు. ఆ సంవత్సరం పాఠశాల స్థాయిలో ఒక విద్యార్థి మాత్రమే 10/10 జిపిఎ సాధించారన్నారు. దీంతో పాఠశాల స్థాయిలో 10/10 జిపిఎ సాధించిన విద్యార్థులలో సోషల్ సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు పురస్కారం ప్రకటించి, ఆవిధంగా సాధించిన ఐదుగురు విద్యార్థులకు రూ.5వేల నగదు పురస్కారం అందజేశామన్నారు. అదే స్ఫూర్తితో పాఠశాలకు చెందిన విద్యార్థులు 20 మంది ఆతర్వాత సంవత్సరం నిర్వహించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 10/10 జిపిఎ సాధించారన్నారు. వారికి రూ.20వేల నగదు పురస్కారాన్ని అందజేశామని తెలిపారు. 10/10 జిపిఎస్ సాధనలో ఒకే పాఠశాలకు చెందిన 20 మంది సాధించటం అది అప్పట్లో తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో రికార్డుగా నమోదైందన్నారు. ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన తనను విద్యార్థులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారని తెలిపారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థులకు రూ.2వేలు నగదు పురస్కారం అందజేస్తున్నానని, దానిని కొనసాగించేందుకు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ సబ్జెక్ట్ ప్రాముఖ్యత గురించి ప్రచారం చేస్తూ, ఆ మేరకు కృషి చేస్తున్న ఉమామహేశ్వరావును ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎంతో పాటు భీమడోలు డైమండ్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొబ్బా రమేష్, విశ్రాంత ఉపాధ్యాయులు పి.బ్రహ్మారావు, ఇతర ప్రముఖులు అభినందించారు.

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి సూచనల మేరకు బాలశక్తి అవార్డులు, 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అవార్డులకు 2023వ సంవత్సరానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ బుధవారం తెలియజేశారు. ఆటలు, సామాజిక, సేవలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, ఆవిష్కరణలో అసాధారణ సామర్థ్యాలు ప్రదర్శించిన 18 సంవత్సరాలలోపు అర్హులైన బాలలు నుంచి ఆన్‌లైన్‌లో https://awards.gov.in ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. కావున సదరు 7 రకాల విభాగాల్లో ప్రతిభావంతులైన బాలలను మరింత ఉత్సాహపరచటానికి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. సదరు అవార్డుల కొరకు అర్హులైన అభ్యర్థులు తరపున వారి తల్లితండ్రులు, బంధువులు, స్వచ్ఛంద సంస్థలు గాని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

ముసునూరు : ఎన్నికల సమయంలో ఎలాంటి ఒడిదుడుకులకు లొంగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలతో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల అధికారి కోటగిరి మురళి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన జరగనున్న వార్డు మెంబర్ల బై ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సిబ్బందికి, డిపిఒ ఆధ్వర్యంలో పలు సూచనలు, సలహాలు చేశారు.

వణుదుర్రులో పోటాపోటీగా ప్రచారం

ముదినేపల్లి : వణుదర్రు గ్రామపంచాయతీ ఉప ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఈనెల 19న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు తమ ప్రచారం ముమ్మరం చేశారు. సర్పంచి ఎన్నికకు నలుగురు అభ్యర్థులు బరిలో ఉండగా, వీరిలో ముగ్గురు అభ్యర్థులు పురుషులు కాగా, ఒక మహిళ అభ్యర్థిని ఉన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి బలపరచిన తోట వెంకటేశ్వరరావు, చిన్నం వెంకటేశ్వరరావులు పోటీలో ఉన్నారు. వీరిద్దరు స్వాయన మామ, అల్లుడు కాగా, వైసిపి బలపరచిన అభ్యర్థి చిన్నం సుగుణబాబు గతంలో వణుదుర్రు సర్పంచిగా పని చేసి ఆకాల మరణం చెందిన చిన్నం అర్జునరావు సోదరుడు. ఇక జనసేన బలపరచిన అభ్యర్థిని కె.రేవతికూడ పోటీలో ఉన్నారు. పోలింగ్ తేది దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి తమకు సర్పంచిగా అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు

ముసునూరు : స్వాతంత్ర్య దినోత్సం రోజున నూతన బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించడం చాలా ఆనందంగా వుందని రమణక్కపేట సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ, ఎంపిటిసి కొండా దుర్గాభవానీలు తెలిపారు. రమణక్కపేటలో జెడ్‌పి స్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు ఆధ్వర్యంలో నూతన బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేశారు.

ఎపి పుట్‌బాల్ అసోసియేషన్ డైరెక్టర్‌గా రాజేష్ నియామకం

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ పుట్‌బాల్ అసోసియేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన రావూరి రాజేష్ నియామకమయ్యారు. పట్టణానికి చెందిన రాజేష్ స్పోర్ట్స్ పర్సన్‌గా, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్‌గా అందరికీ సుపరిచితుడే. కరాటే, క్రికెట్, పుట్‌బాల్ క్రీడలకు అప్‌ల్యాండ్ ప్రాంతంలో సేవలు అందిస్తూ వాటి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న రాజేష్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పుట్‌బాల్ అసోసియేషన్‌లో ఇసి మెంబర్ గా ఉన్నారు. ఇటీవల డైరెక్టర్ అఫ్ పుట్‌బాల్ ఆపరేషన్స్‌గా రాజేష్ నియామకంపై స్థానిక క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పదవికి ఎంపిక చేసిన ఆంధ్రప్రదేశ్ పుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌లకు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కలశాలను జిల్లా కేంద్రానికి తరలింపు

ముసునూరు: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 'నా దేశం - నా భూమి', ఆజాదిక అమృత మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన కలశాలను బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి తరలించనున్నట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర, కేంద్ర కార్యాలయాలకు తరలిస్తామని ఆమె తెలియజేశారు.

పోలవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పోలవరం: పోలవరం-1లో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అధ్యక్షతన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పోలవరం-1లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్ఎ బాలరాజు, ఐటిడిఎ పిఒ సూర్య తేజతో కలిసి ప్రారంభించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి - భీమడోలు

షంషుద్దీన్, విఆర్ఒలను సత్కరిస్తున్న భీమడోలు తహశీల్దార్

విధుల నిర్వహణలో సమర్థవంతమైన సేవలు అందించిన భీమడోలు డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్, పొలసానిపల్లి విఆర్ఒ సింహాచలం సేవలు ఇతరులకు ఆదర్శప్రాయమని భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ తెలిపారు. వీరివురు తాము అందించిన సేవలకుగాను స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరులో మంత్రి విశ్వరూప్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను మంగళవారం స్వీకరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు సకాలంలో పరిష్కారం, ఓటర్ల జాబితా, తాజా సర్వే సమర్థవంతంగా నిర్వహించడం, సమగ్ర భూ సర్వే కార్యక్రమం మండల స్థాయిలో సజావుగా అమలు అయ్యేందుకు ఏర్పాటు చేసిన బృందానికి నాయకత్వం వహించిన డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ సేవలు అభినందనీయమన్నారు. ఇదేవిధంగా విఆర్ఒగా సింహాచలం గ్రామపంచాయతీ స్థాయిలో చేపట్టిన కార్యక్రమాలు ప్రశంసనీయమని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కిరణ్ కుమారి, విఆర్ఒల సంఘ నాయకులు శంకర్ పాల్గొన్నారు.

మండవల్లి : విధి నిర్వహణలో ప్రజలకు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు పురస్కారాలు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మంగళవారం అందజేశారు. జిల్లా కేంద్రం ఏలూరులో మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వారికి ప్రశంసా పత్రాలను అందించారు. మండలంలో హౌసింగ్ శాఖలో ఎఇగా పనిచేస్తున్న వివిఎస్ శేఖర్ గృహ నిర్మాణంలో ఉత్తమ సేవలు అందించినందుకు ఉత్తమ పురస్కారం జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్, ఇంఛార్జి మినిస్టర్ విశ్వరూప్ చేతుల మీదుగా ఆయన మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 సంవత్సరంలో గృహ నిర్మాణ శాఖలో అందించిన సేవలను గుర్తించి, అధికారులు పురస్కారాన్ని అందించారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గృహ నిర్మాణ శాఖాపరమైన సేవలను సకాలంలో అందిస్తూ లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా సేవలందిస్తానని ఆయన తెలిపారు. ఉత్తమ పురస్కారం అందుకున్న ఆయనను మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రశంసించారు.

ముసునూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ చట్టం కార్యాలయంలో పనిచేస్తున్న కె.అర్జునరావుకు ఉత్తమ కంప్యూటర్ అవార్డు తీసుకున్నట్లు ఎపిఒ టి.రోస్‌లీలా తెలిపారు. జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు పురస్కరించుకుని డ్వామా పీడి చేతుల మీదగా అవార్డు అందుకున్నందుకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

చింతలపూడి: ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా అశోక్‌కు ఉత్తమ అవార్డు రావటం అభినందనీయమని చింతలపూడి ఎంపిపి రాంబాబు తెలిపారు. చింతలపూడి ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం ఎంపిడిఒ మురళీకృష్ణ, ఇఒ ఆర్డివిక్టర్ ప్రసాద్ కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు.

పారిశుధ్య కార్మికులు, ఆశాలకు దుస్తుల పంపిణీ

వస్త్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచి అలకనంద

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురానికి చెందిన మాజీ సర్పంచి, కీర్తిశేషులు గుణ్ణం రామచంద్రరావు తనయుడు సురేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు, యువకులు అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని సర్పంచి దిడ్ల అలకనంద తెలిపారు. బుధవారం సురేష్(రిషి) జన్మదినోత్సవం సందర్భంగా నారాయణపురం పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలకు నూతన వస్త్రాలు అందజేశారు. చేబ్రోలు, ఉంగుటూరులో అనాధ శరణాలయంలో చిన్నారులకు అన్నసమారాధన నిర్వహించారు. చేబ్రోలు పిహెచ్‌సిలో వైద్యులు కెఎస్ సుబ్బరాజు వర్మ పర్యవేక్షణలో కేకు కోసి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు అభిమానులు వెజ్జు సుబ్బారావు, నల్లా ఆనంద్, గాది రమణ, యలమాటి ప్రసాద్, సీపాని రమేష్, పూడి రామకృష్ణ, గోలి బాలాజీ, కిలపర్తిదుర్గ, అగస్తి ప్రసాద్, ఎస్ఎస్, జివి మోటార్స్ స్టాఫ్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేబ్రోలు పిహెచ్‌సిలో రోగులకు పండ్లు పంపిణీ

ప్రజలకు సత్వరమే సేవలందించాలి : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి - మండవల్లి

సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు సత్వరమే సేవలందించాలని డిఎల్‌డిఒ జి.రమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండవల్లి, ముదినేపల్లి మండలాలకు చెందిన డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ లోన్‌లపై వన్ టైం సెటిల్మెంట్(ఒటిఎస్)పై సచివాలయాలలో అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో అందిస్తున్న సేవలకు వసూలు చేస్తున్న రుసుమును ఎప్పటికప్పుడే డీడీల ద్వారా చెల్లించాలని తెలిపారు. అనంతరం త్వరలో అందించే సేవలకు రుసుములు వసూలు చేసి చెల్లించడంలో హౌసింగ్ లోన్స్ వన్‌టైమ్ సెటిల్మెంట్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో ఆయన ముదినేపల్లి, మండపల్లి మండలాల సచివాలయ సిబ్బందిని, కార్యకర్తలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండవల్లి, ముదినేపల్లి మండలాల ఎండిఒలు వెంకటరమణ, మల్లేశ్వరి, పిఒపిఆర్ డి.ఆనందబాబు, ఎఒ శ్రీనివాసరావు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ..

వృద్ధుల సంరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్కునూరు రామచంద్రరావు కోరారు. బుధవారం ప్రపంచ వృద్ధుల కోర్కెల దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మసీదు సెంటర్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్కునూరు రామచంద్రరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ చట్టం పటిష్టంగా అమలు చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సర్వేశ్వరరావుకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కోటేశ్వరరావు, కార్యదర్శి కేదారేశ్వర రెడ్డి, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి సుబ్బరాయ శర్మ, గౌరవ సలహాదారు బాలకృష్ణ, దాదా యాకూబ్, మల్లిఖార్జునరావు, మాధవరావు పాల్గొన్నారు.

డీజెలకు అనుమతివ్వాలి

మండవల్లి : వినాయక చవితి ఉత్సవాలలో డీజెలను ఏర్పాటుకు సహకరించాలని కైకలూరు నియోజకవర్గ సౌండ్ లైటింగ్ షామియానా డెకరేషన్ యూనియన్ అధ్యక్షులు బొప్పన శివకుమార్ ఎస్ఐ రామకృష్ణను కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు అయిన **అడుసుమిల్లి అజయ్‌కుమార్, S/o. జానకిరామయ్య, R/o. డో.నెం. 751/6-1,** ఆదర్శనగర్, ఏలూరు, ఏలూరు జిల్లా, వారు ఇచ్చిన వివరణపై ఇచ్చుచున్న పబ్లిక్ నోటీసు.

మా క్లయింటు ది. 12-04-2023వ తారీకున వారి మామగారైన (లేటు) అట్లూరి చిత్తరంజన్ గారి ఇల్లు డో.నెం. 13-43 నుండి వారి పేరున ఉన్న **ఒరిజినల్ దస్తావేజు నెం. 5187/1992** ను తీసుకుని మోటారు సైకిల్‌పై పెదపాడు నుండి వట్లూరు రోడ్డు గుండా ఏలూరు వచ్చుచుండగా దస్తావేజు ఉన్న కవరు పడిపోయినది. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు తారీకు 10-08-1992, Vide దస్తావేజు నెంబరు 5187/1992 ఎవరికైనా దొరికినచో ఈక్రింద తెలిపిన అడ్రసులో అందజేయగలరు.

ఈడ్పుగంటి శ్రీనివాసబాబు
అట్లూరి రవికుమార్
రోడ్ నెం.2, ఎన్‌జిఒ కాలనీ, అమీనాపేట
అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 9491089199

క్రాప్ మిత్ర, షెడ్ మిత్రాలకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని క్లాత్ మిత్ర, షెడ్ మిత్ర, ట్రై సైకిల్ మిత్రాలకు 18నెలలగా ఇవ్వాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈధర్నాలో సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ 2018 సంవత్సరంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలో ఉన్న పొడి చెత్త, తడి చెత్తను సమీకరించి, సంపద కేంద్రాలలో ఎరువును తయారుచేసి, దాని ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో క్రాప్‌మిత్ర, షడ్‌మిత్ర, ట్రైసైకిల్ మిత్రాలను నియమించామని తెలిపారు. ఆనాటి నుంచి పంచాయతీలో విధులు శుభ్రం చేయటం దగ్గర నుంచి ప్రతీ చిన్న పని, పెద్ద పని చేయించుకుంటున్నటువంటి ప్రభుత్వం గత 18 నెలలుగా వీరికి జీతాలు చెల్లించటం లేదని, ఇన్ని నెలలు జీతాలు ఇవ్వక పోవటం దారుణమన్నారు. ఉపాధి భద్రత, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించి, పనిచేసే ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలన్నారు.

అనంతరం ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్‌కు వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసిటియు మండల కమిటీ సభ్యులు దుర్గం చిన్నప్ప, క్లాస్ మిత్ర, షెడ్డు మిత్ర కార్మికులు పాల్గొన్నారు.

250 మందికి పరీక్షలు

పోలవరం: టిబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాయతీ ఆవరణలో సర్పంచి పొడుం పుష్ప అధ్యక్షతన మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వైద్యానికి సంబంధించిన 15 మంది డాక్టర్లతో టిబిఆర్ ఫౌండేషన్ ద్వారా గ్రామాలలో నివసించే ప్రజలకు వైద్య సేవలు అందించి వారిని అన్ని విధాల ఆదుకుంటున్నామని తెలిపారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

ముదినేపల్లి : సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు బుధవారం ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి యువ నాయకులు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండవల్లి : సర్దార్ గౌతు లచ్చన్న 114వ జయంతిని పురస్కరించుకుని ప్రధాన సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MATTI BHARATH KUMAR, S/O. MATTI SYAM SUNDAR JYOTHI BABU, D.NO. 6-131, PEDAPETA, SIDHANTHAM, PENUGONDA (M), W.G.DT. A.P. I HAVE CHANGED MY NAME FROM MATTI BHARAT KUMAR (OLD NAME) TO MATTI BHARATH KUMAR (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE COUNTINUE WITH MY NEW NAME MATTI BHARATH KUMAR

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో
O.S.No. 295/2017

బిట్వీన్:
సామాంతుల రమేష్ బాబు (డైడ్) మరియు వగైరాలు ...**వాదులు**
మరియు
గంగాడ ఉమామహేశ్వరరావు మరియు వగైరాలు ...**ప్రతివాదులు**

పై నెంబరు గ్రంధములో వాదులు, ప్రతివాదులపై రూ.9,66,333/-లు వడ్డీ మరియు ఖర్చులతో సహా ప్రిలిమినరీ మార్టగేజ్ డిక్రీ ఇప్పించమని పైకోర్టులో దాఖలు చేసి యున్నారు. దానిపై 6వ ప్రతివాది అయిన D-6: Macha Semyu Sree, D/o. Late Naga Babu, D/o. Late Macha Eswara Kanaka Lakshmi, D.No. 201-11-16, Gandhi Nagaram, Lavetivari Street, Eluru, Eluru District (D-6 beaing minor represented by her narutal guardian D-1 Gangada Uma Maheswara Rao) అను వారికి ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది.24-08-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ అట్లూరి పవన్‌కుమార్
న్యాయవాది, ఖండ్రికగూడెం,
తంగెళ్ళమూడి, ఏలూరు. ఏలూరు జిల్లా.
సెల్: 98488 37162

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు **శ్రీ రాయి సత్యనారాయణ, తండ్రి: రాముడు** గారికి అయితంపూడి గ్రామంలో **దాక్యుమెంటు నెం. 2973/2000** క్రయ దస్తావేజులు పొందియున్నారు. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, తణకు బ్రాంచి నందు ఋణం తీసుకొనుచున్నాడు. సదరు ఆస్తికి సంబంధించి లింకు **డాక్యుమెంటు ఒరిజినల్ రిజిష్టరు దస్తావేజు నెం. 1162/1983,** ఈ లింకు ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ కాపీ తీసుకొనుటకు వెళ్ళుచుండగా ఈ దస్తావేజు కవరు తప్పిపోయినది. ఎంతో కాలముగా వెతికానా దొరకలేదు. వెరిటాస్ ఫైనాన్స్ తణుకు బ్రాంచి గారి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజినల్ డాక్యుమెంటు పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా 1162/1983 యొక్క సర్టిఫైడ్ కాపీ ఋణ మొత్తానికి హామీగా సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్సుతో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ కనుగొన్న లేదా దొరికినా వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్సు దొరికినవారు ఎవరైనా వీటిని వినియోగించిన ఎడల చట్టవిరుద్ధము మరియు వారిపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎ.నాగేశ్వరరావు
అడ్వకేట్ & నోటరీ
తణుకు, సెల్: 9110382946

మహారాజశ్రీ ఏలూరు ఫ్యామిలీ కోర్టు /7వ అదనపు జిల్లా వారి కోర్టు :: ఏలూరు
ఎఫ్.డి.ఐ.ఎ.నెం. 1006/2019
ఓ.ఎస్.నెం. 54/2006

బిట్వీన్:
శ్రీమతి భావనా విశ్వనాథ్ ...**పిటీషనరు**
మరియు
శ్రీమతి చలపాటి వెంకాయమ్మ (డైడ్)
శ్రీమతి యలమంచిలి శేషాయమ్మ వగైరా
...**రెస్పాండెంట్లు**

పై నెంబరులో పిటీషనరు, ది.26-02-2018వ తేదీ గల ప్రిలిమినరీ పార్టిషన్ డిక్రీ రిత్యా షెడ్యూలు ఆస్తులు విభజించుటకు అడ్వకేట్ కమీషనర్‌ను నియమించి ఆస్తులను విభజించి ఫైనల్ డిక్రీ పాస్ చేయమని కోరుతూ పై నెంబరు పిటీషను దాఖలు చేసినారు. సదరు పిటీషనులో రెస్పాండెంట్లు 9 నుండి 10 వారలైన 1) శ్రీమతి చలపాటి భవిత, వైఫ్ ఆఫ్ శ్రీ వేంకటేశ్వరరావు 2) శ్రీ చలపాటి గోపి కృష్ణ దర్సిత్, సన్ ఆఫ్ శ్రీ వెంకటేశ్వరరావు 3) శ్రీ చలపాటి సాయి హర్షిత్, సన్ ఆఫ్ శ్రీ వెంకటేశ్వరారవు, ఈస్టు చోడవరం, తాడేపల్లిగూడెం మండలం, వారికి నోటీసు నిమిత్తం ది.15-09-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. కాబట్టి పైవారలు పై కోర్టు వారి ఎదుట **ది.15-09-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల వారి పరోక్షమున పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఎస్.వి.ఆర్.గాంధీ
ఏలూరు, పిటీషనరు తరుపు అడ్వకేట్
16-8-23. ఏలూరు.